క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ


వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామపంచాయతీ పరిధిలోని హరిజనవాడకు చెందిన చెరివి రమణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు నగదును గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంబాబు సోమవారం గ్రామానికి వెళ్లి మృతుడి భార్య అంకమ్మకు సోమవారం నగదును అందజేశారు. వైఎస్ఆర్ బీమా పథకంలో రూ.లక్ష బీమా వస్తుందని, అంత్యక్రియలకు రూ.10 వేలు ఇచ్చి మిగిలిన రూ.90 వేలును నామిని అంకమ్మ అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు.

పల్లికొండేశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ శివజ్ఞాన గురుశ్రీకూణం పట్టి కల్యాణపురి ఆధీనంలో 57వ శ్రీగురు రాజశరవణ మాణిక్య వాసగ పరమాచార్య స్వామివారి చేతుల మీదుగా సోమవారం ఉదయం 7 గంటలకు మాణిక్య వాసగర్ ఉత్సవమూర్తి ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. అలాగే తిరువాచకం (యోగ పీఠం, విద్యాపీఠం) పుస్తకాన్ని ప్రతిష్ఠించిన అనంతరం యాగశాలలో ఏకాదశి రుద్రహోమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, జి.మునివేలు, ఎస్.మంజుల, ఉమాపతి, పి.కవిత, సందీప్, ప్రత్యేక ఆహ్వానితులు బి.రాధాకృష్ణరెడ్డి, రుద్రాభిషేకంలో పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న పఠాన్ ఫరీద్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు పఠాన్ ఫరీద్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని సరస్వతీబాయి పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

నారాయణవనం: గ్రామాల్లో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్‌రాజ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నిల్వ అయిన నీటిలో దోమలు త్వరగా వృద్ధి చెందుతాయన్నారు. దోమ లార్వాలను సులువుగా నాశనం చేయడంతో పాటు దోమలను నియంత్రించవచ్చన్నారు. మిలాథిన్ లేదా ఆయిల్ బాల్స్‌తో దోమల లార్వాను పూర్తిగా ధ్వంసం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను విధిగా అందరూ పాటించాలని సూచించారు. జ్వరాల కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసి చర్యలు తీసుకునేలా ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

అమెజాన్ సేవలు ప్రశంసనీయం

రేణిగుంట: తుపాను ప్రభావ ప్రాంతాల్లోని ప్రజలకు ఆసరాగా నిలుస్తున్న అమెజాన్ సామాజిక కార్యక్రమాలు ప్రశంసనీయమని కృష్ణాపురం సర్పంచ్ ముద్దురాయులు అన్నారు. మండలంలోని కృష్ణాపురం, ఆర్.మల్లవరం ఎస్టీ కాలనీలలో సోమవారం అమెజాన్, డొనేట్‌కార్ట్ సౌజన్యంతో ఆషా సంస్థ ఆధ్వర్యంలో తుపాను బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు.

అన్నదాన సత్రం తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఈవో కేఎస్ రామారావు సోమవారం తనిఖీ చేశారు. భక్తులను అడిగి భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. వంటశాలలో కూరగాయలు, బియ్యం, పప్పులు వంటి వాటిని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.


భక్తులతో మాట్లాడుతున్న ఈవో రామారావు

పండుగలా గడప గడపకు మన ప్రభుత్వం


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళ


తుపాను బాధితులకు సరుకులు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి


జలహారతి ఇస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓటేరు కాలువ, గాంధీ వీధి, కోనేరు, నాగులగుంట, పాత బస్టాండు, నగారిపాళెం తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గాంధీ వీధికి చెందిన మహిళ తనకు కిడ్నీ వ్యాధి ఉందని తెలపడంతో కార్యాలయానికి రావాలని సూచించారు. సంక్షేమ ప్రదాతకు ఎల్లప్పుడు తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రావు పవార్, లోకేష్ యాదవ్, పగడాల రాజు, నాగరాజు, అస్లాం, సాగి రాబీ, షర్మిలతాగూర్, గిరిరెడ్డి, జగదీష్, చంద్ర, పెంచులమ్మ, ఇస్మాయిల్, గిరిజ, కలాం, పర్వీన్, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

శ్రీకాళహస్తి: తుపాను బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రాజెక్టువీధి, ఎస్టీ కాలనీలో బాధితులకు బియ్యం, ఆయిల్, పప్పులను అందజేశారు. ఒక వ్యక్తి ఉన్న కుటుంబానికి రూ.వెయ్యి, ఇద్దరు ఉన్న కుటుంబానికి రూ.2వేలు, ఇద్దరికన్నా ఎక్కువ ఉన్న కుటుంబాలకు రూ.2,500 అందజేశారు. ఆమె మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎపుడు వరద బాధితులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అకాల వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందిస్తే, వారికి వెంటనే సహకారం అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ రెడ్డి, జయకృష్ణరెడ్డి, శంకర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జలహారతి

ఏర్పేడు: మండలంలోని సదాశివకోన రిజర్వాయర్ వద్ద సోమవారం సాయంత్రం జలహారతి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి హాజరై సారెను తీసుకుని వెళ్లి రిజర్వాయర్ వద్ద పూజలు చేసి, జలహారతి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు నీటిలో దీపాలు వదిలి వందనం చేశారు. రిజర్వాయర్ నీటితో నిండుకుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, నాయకులు గురునాథం, మధు యాదవ్, దినేష్, శ్రీహరి, జీపీ యాదవ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్యవేడు: రవాణా సమస్యల పరిష్కారానికి సంబంధించి మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు చెప్పుకునేందుకు ప్రయాణికులు 9959225682కు ఫోన్ చేయాలని కోరారు.

అన్నదానం

శ్రీకాళహస్తి: భక్తుల సేవే మాధవ సేవ అని శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో సోమవారం శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దీనికి డీఎస్పీ భీమారావు ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దానిలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. అపుడే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సుందరంగా తీర్చిదిద్దండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థం, పుష్కరిణిని సుందరంగా తీర్చిదిద్దాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆలయ ఈవో కేఎస్ రామారావు, చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు వినతిపత్రాలు అందజేశారు.

ముక్కంటి సేవలో మంత్రి ఆర్‌కే రోజా


మంత్రి ఆర్‌కే రోజాను ఆశీర్వదిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి సోమవారం మంత్రి రోజా స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆమె సోమవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆమెను ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లోకేష్‌యాదవ్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సత్యనారాయణ

సత్యవేడు: నియోజవర్గ పరిధిలో ఏడు మండలాల్లో ఉన్న జగనన్న కాలనీల హౌసింగ్ టార్గెట్‌లను జనవరిలోపు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ జేవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యవేడులో 419, వరదయ్యపాళెంలో 307, నారాయణవనంలో 419, కేవీబీపురంలో 445, నాగలాపురంలో 210, బుచ్చినాయుడుకండ్రిగలో 198, పిచ్చాటూరులో 120 ఇళ్ల నిర్మాణం టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించించారు. హౌసింగ్ ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేయాలని, కాలనీల్లో మరుగుదొడ్లు, నీటివసతి, రోడ్లు, విద్యుత్ ఏర్పాట్లు సమగ్రంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు వై.సుబ్రమణ్యం, డి.హరి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సత్కారం


వ్యాయామ ఉపాధ్యాయుడు ముద్దుకృష్ణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం: తిరుపతిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వరదయ్యపాళెం హైస్కూల్ పీడీ బందిల కుమార్, గోవర్ధనపురం హైస్కూల్ పీడీ ముద్దుకృష్ణను వేర్వేరుగా ఆయా పాఠశాలల్లో సోమవారం ఘనంగా సత్కరించారు. తారకరామ స్టేడియంలో సుమారు 550 మంది పాల్గొన్న మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి క్రీడల్లో వ్యాయమ ఉపాధ్యాయుడు ముద్దుకృష్ణకు స్వర్ణ పతకం, మరో వ్యాయామ ఉపాధ్యాయుడు బందిల కుమార్ కాంస్య పతకాలు కైవసం చేసుకుని జిల్లా చాంపియన్‌లుగా నిలిచారు. వీరిని ప్రధానోపాధ్యాయులు సమక్షంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, ఎక్స్ అఫిషియో మెంబర్ గుత్తి త్యాగరాజు ఘనంగా సత్కరించారు.

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్లు చేసుకోండి

కేవీబీపురం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 19 సచివాలయాలకు గానూ ఇప్పటివరకు 480 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మరో రెండురోజులు మాత్రమే సమయం ఉందని, ఈలోపు ఆసక్తి ఉన్నవారి వివరాలను వలంటీర్లు దగ్గరుండి వారి పరిధిలోని క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆయన ఆదేశించారు.

ఎంపీడీఓ కార్యాలయానికి క్రీడా పరికరాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 15 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఇందుకోసం మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు క్రీడాకారుల కోసం క్రీడా కిట్లు ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూలస్థానేశ్వరాయంలో ప్రత్యేక పూజలు


గాజులమండ్యం మూలస్థానేశ్వరాలయంలో విశేష అలంకరణలో స్వామివారు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం శ్రీ కామాక్షిదేవి సమేత మూలస్థానేశ్వరాలయంలో ఆఖరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన నిర్వాహకులు జువ్వల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేసి, పుష్పాలంకరణ చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో మేళ,తాళాల మధ్య ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు.

శుకబ్రహ్మాశ్రమంలో వన భోజనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుక బ్రహ్మాశ్రమంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని వన భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా ఆశ్రమంలో రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాలను ప్రారంభించారు. విద్యాప్రకాశనందగిరిస్వామి భక్తులు, పట్టణ ప్రముఖులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలీశ్వరస్వామి ఆలయంలో..

నారాయణవనం: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని పాలమంగళం పాలీశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ముందుగా మూలవర్లకు చందన అలంకరణ చేశారు. సాయంత్రం పాలీశ్వరస్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథునికి అభిషేకాలు, బిల్వార్చన చేపట్టారు.

సర్వం.. శివోహం..

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు వద్ద ఉన్న జ్యోతీశ్వరాలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, అరుదూరులోని శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, వెంకటరెడ్డికండ్రిగ, బత్తలవల్లం, కురింజల్లంలోని శ్రీ చంద్రకళాంబికా సమేత శ్రీ బ్రహ్మపుడేశ్వరస్వామి వారి ఆలయాల్లో వేకువజామున నుంచి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆది దంపతులు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మోహనాచార్యులు, రాజేంద్ర ప్రసాద్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే అంబికాపురంలోని శ్రీకృష్ణాశ్రమంలో కార్తీక వనభోజనాలను నిర్వహించారు.

అటవీ అభివృద్ధి సంస్థలో తనిఖీలు

సత్యవేడు: ఆదాయపరంగా సత్యవేడు అటవీ అభివృద్ధి సంస్థ నంబర్ వన్ స్థానంలో ఉందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నైనార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన సత్యవేడులోని అటవీ అభివృద్ధి సంస్థను పరిశీలించారు. కార్యాలయ సమీపంలో మూసివేసిన నర్సరీ చాంబర్లను తనిఖీ చేశారు. మూసివేసిన నర్సరీలను తెరిపించాలని డివిజన్ మేనేజర్ బ్రహ్మయ్య కోరగా, నివేదికలు పంపాలని సూచించారు. అనంతరం శ్రీవనరాజ విఘ్నేశ్వరస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన కార్తీక వనమహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు సోము, రమేష్, మహేష్, శ్రీధర్, గౌడ్, పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు సరుకుల వితరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామంలో తుపాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు మాజీ సర్పంచ్, మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకుడు గెడితొట్టి గురవయ్య ఆధ్వర్యంలో తహసీల్దారు భార్గవి సోమవారం సరుకులను పంపిణీ చేశారు. 150 ఎస్టీ కుటుంబాలకు బియ్యం, వంట నూనెను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు భార్గవి మాట్లాడుతూ తుపాన్ వల్ల కూలి పనులు లేక ఇబ్బంది పడుతున్న ఎస్టీల కుటుంబాలకు గురవయ్య సరుకులను పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురవయ్య, మండల సోషల్ మీడియా కన్వీనరు యనమల ప్రసాద్, నాయకులు సాయినాయుడు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


ధర్నా చేస్తున్న మృతురాలి బంధుమిత్రులు


నిషా (ఫైల్)

నాగలాపురం: భర్త వివాహేతర సంబంధ విషయమై నిలదీసిన భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం.. నాగలాపురం వెస్ట్ దళితవాడకు చెందిన నిషా(23), శర్మ భార్యాభర్తలు. మూడు రోజుల క్రితం భర్యాభర్తల మధ్య చిన్న పాటి తగాదా చోటుచేసుకుంది. వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించిన భార్య నిషాపై భర్త చేయి చేసుకున్నాడు. మనస్తాపానికి గురైన నిషా ఆత్మహత్యకు పాల్పడి, తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. దీనిపై మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆపై పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి ఏడాదిన్నర పాప ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాడుదాం

శ్రీకాళహస్తి: కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని రోజు రోజుకూ నీరుగారుస్తోందని, విద్యా పరిరక్షణకు పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భగత్ రవి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ శ్రీకాళహస్తి మహాసభ స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానం వల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు చదువు దూరం అవుతుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్య కోసం విద్యార్థులు నడుం బిగించి భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ భవిష్యత్తు నిర్మాతలుగా తయారవ్వాలన్నారు. వ్యవసాయ సంఘం నాయకులు గురవయ్య మాట్లాడుతూ కార్మికుల సృష్టిస్తున్న దేశ సంపదను కొంతమంది కొల్లగొడుతున్నారని వాటి పరిరక్షణకు విద్యార్థులు చదవుతో పాటు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మణి, గురవయ్య, హరీష్, మోహన్, కొండేటి మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'పోషణ్ అభియాన్'ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న సత్యవేడు సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: పోషణ్ అభియాన్ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం ఇస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ దేవకుమారి అన్నారు. సోమవారం రాజుల కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో ×పోషణ్ అభియాన్‌' కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకంలో గర్భిణులకు 3 కిలోల బియ్యం, కిలోపప్పు, నూనె అరలీటర్, గుడ్లు 13 పంపిణీ చేస్తున్నారన్నారు. మనబడి నాడు–నేడు కింద సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లోని 70 అంగన్‌వాడీలకు నీటివసతి, మరుగుదొడ్లు, విద్యుత్ వసతుల కల్పనను నిధులు మంజూరైందన్నారు. పలు కేంద్రాల్లో వసతులు కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కే.రవి, సూపర్‌వైజర్లు ఏ.చెంచులక్ష్మి, ఎం.జ్యోతి, సి.శిల్ప, యమున, సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశం.. బహుభాషల నిలయం

బుచ్చినాయుడుకండ్రిగ: భారతదేశం బహుభాషలకు నిలయమని, భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటిస్తూ భారతీయ భాషలపై నేటి విద్యార్థులు పట్టు సాధించాలని ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ తెలిపారు. మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ భారతీయ కవి సుబ్రమణ్య భారతి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రూపేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో భారతీయ భాషోత్సవం–2023 నిర్వహణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 22 భాషలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం సుబ్రమణ్య భారతి సాహితీ ప్రస్థానంతో పాటు వివిధ భాషల్లో ప్రసిద్ధి చెందిన పలువురు కవులు, రచయితల భాషా సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, ఒబ్బు ప్రసాద్, దాసు, దేవేంద్ర, జగన్నాథం, నాదెండ్లమురళి, వేణుగోపాల్, లక్ష్మయ్య, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కోసం జగనన్నే రావాలి


సత్యవేడు: బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

రేణిగుంట: పేదల సంక్షేమంతోపాటు ఈ సుపరిపాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి అన్నారు. ఆమె సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్య క్రమం నిర్వహించారు. వేణుగోపాలపురం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్, కో–ఆప్షన్ సభ్యుడు హసన్ సాహెబ్, ఇరానీ ఖాదర్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలకు మేలు

సత్యవేడు: జగనన్న మళ్లీ సీఎం అయితేనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి అన్నారు. సత్యవేడు సచివాలయంలో సర్పంచ్ పి.మంజుల అధ్యక్షతన సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ ముని రవికుమార్, నాయకులు బెల్లు రమేష్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో టీటీడీ అన్నమాచార్య ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వీరికి ఈవో రామారావు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

పసల కృష్ణయ్యకు ఘన సన్మానం

శ్రీకాళహస్తి: పట్టణ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పసల కృష్ణయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు పార్టీ పదవి రావడంతో అభిమానులు సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తామన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నారాయణవనం: మండలంలోని కొండలచెరువులో మంగళవారం పుత్తూరులోని అన్న గౌరి వైద్య కళాశాల, హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ మేనేజర్ ప్రదీప్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొండలచెరువులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే వైద్యశిబిరంలో ఎముకలు, ముక్కు, గొంతు, చెవి, చర్మ వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. అవసమరమైన వారికి శస్త్రచికిత్స చేయిస్తామని అన్నారు.

భవిత కేంద్రం దివ్యాంగులకు వరం






ఏర్పేడు: బహుమతి అందిస్తున్న ఎంఈఓ ప్రేమలత, సత్యవేడు: దివ్యాంగులకు ప్లేట్లు అందజేస్తున్న ఎంఈఓ రవి, నాగలాపురం: దివ్యాంగులతో అధికారులు

ఏర్పేడు: భవిత కేంద్రం దివ్యాంగులకు ఒక వరమని ఎంఈఓ ప్రేమలత అన్నారు. ఏర్పేడు భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, బిస్కెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రభుత్వం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, స్వర్ణలత, లావణ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్యవేడు: దివ్యాంగ విద్యార్థులు మేధాశక్తికి పదును పెట్టి సాధారణ వ్యక్తులతో సమానంగా రాణించాలని ఎంఈఓ కే.రవి సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సోమవారం భవిత భవనంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న పరికరాలు, కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రావు, సీడీపీఓ దేవకుమారి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలాపురం: వైకల్యం అనేది శారీరకలోపంగా భావించాలే తప్ప శాపంగా పరిగణించకూడదని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కస్తూరయ్య అన్నారు. మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.కృష్ణవేణి మాట్లాడుతూ భవితా కేంద్రాలకు రాలేని వారి కోసం ప్రభుత్వం హోంబేస్డ్ ఎడ్యుకేషన్ అందిస్తోందని వెల్లడించారు. సదరం స్లాట్ ద్వారా అంగవైకల్యం ఉన్నవారికి సర్టిఫికెట్లు జారీ చేస్తుందని తెలిపారు. చెన్నైకి చెందిన సెంథిల్‌నాథన్ స్నేహితులు దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు, భోజనాలు ఏర్పాటు చేశారు.